ఓం - తత్ - సత్ - శుభమ్

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

# హరి శ్రీ కృష్ణ శతకము


రచయిత

తుప్పిలి సుదర్శనరావు పట్నాయక్ M. A. B.Ed

టీచరు

జిల్లా పరిషదున్నత పాఠశాల

గంగుబూడి

విజయనగరం జిల్లా



ముద్రాపయిత్రి

శ్రీ స్వప్రకాశమ్మ

కొత్తవలస


సర్వహక్కులు రచయితవి మూల్యం రు 1-00

ప్రథమ ముద్రణము 500 కాపీలు
1980

శ్రీ వరదా ప్రింటర్సు
జేవాళ

ఓం.

# హృదయనివేదన

శ్రీమదనంతలీలాపరంపరకృపాపారావారుని, పారావారగంభీరుని, గంభీరజనవాత్సల్యుని, వాత్సల్యాపుహాపావతారుని, అవతారలక్ష్యనిరంతరుని, నిరంతరభక్తలోకలోలత్వమందపార శ్రద్ధాసక్తుల జూపు శ్రీమన్నారాయణుని గీర్తించు భాగ్యమే మహాభాగ్యము.

'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' యను గీతోక్తి ప్రకారము యుగ యుగములందవతారము దాల్చు దేవ దేవుడు ద్వాపరయుగమున శ్రీకృష్ణ పరమాత్మునిగా నుద్భవించి సర్వలోకరంజితుడై సర్వమతసమ్మతుడై యొప్పి శిష్టరక్షణము, దుష్టశిక్షణము తన విశిష్టధర్మముగా నెంచునట్టివాని నిర్హేతుకకృపచే నీ శతకము 'హరి శ్రీకృష్ణా' అను మకుటముతో వ్రాయ సంకల్పించి పూర్తి జేయగలిగితిని.

పరమాత్మను నిర్గుణరూపునిగా జెప్పుటయే సదుక్తి యనియు, రూపరహితునిగా దలంచి అతని పాదపద్మములను సేవించుటయే భక్తియనియు, క్రియారహితునిగా నెంచి అతని శృంగార చేష్టల కొనియాడుటయే రక్తియనియు, ఆకారణజన్ముని గూర్చి చింతించుటయే విరక్తియనియు, ఈ సంసారమునందెల్లవేళల నాసక్తిని విడిచి యుండుటయే ముక్తియనియు, ఆ నామరహితుని నామస్మరణయే భక్తియనియు, ఆ నామస్మరణవలన జనించు ప్రేమయే శక్తియనియు దలంచి

అట్టి సర్వశక్తిసంపన్నుండును నిత్యప్రమోదయుతుండును, వేదస్తుత్యుండును, పురాణపురుషుండును, దివ్యపాదారవిందుండును నైనవాని నెవ్వరు స్మరింతురో వారే యోగ్యులును, పుణ్యులును, ధీరులును, సూరులును, మఱియును సర్వజనప్రియులునై భాసిల్లెదరు.

ఏతన్మహాగుణగణ్యులు నాయందనన్యవాత్సల్యభావసంపద ప్రసరించి యీ కృతియందలి దోషములు బరిహరించి గుణములను మాత్రము గ్రహింపవేడెదను.



కోరిన తక్షణం బామూలాగ్రంబుగ బరిశీలించి సదభిప్రాయం బిచ్చిన కౌముదీ పరిషదుపాధ్యక్షులు, సాహిత్యకోవిద బిరుదాంకితులునగు శ్రీయుతులు క్రొవ్విడి రామం బి. ఏ. బి. ఎల్. బి. ఇడి., గారికి నా నమోవాకములు మఱియు ఆదరపురస్సరముగా అమూల్యాభిప్రాయంబిచ్చిన నామసపాసిని శ్రీ మేకా రామారావు బి. ఏ. బిఇడి వారికి నా హృదయపూర్వక నమస్కారములు. స్థాలీపులాకన్యాయమున జూచి వివరణాత్మక సలహాలనొసంగి ఆశీస్సులనందజేసిన శ్రీయుతులు పంతుల లక్ష్మినారాయణశాస్త్రిగారికి నా మనఃపూర్వక వందనములు. రచనా ప్రోత్సాహమిచ్చిన మా చిన్నాన్నగారు శ్రీ కుప్పిలి బలరామస్వామిగారికి నా నమస్సులు.

ఈ కృతియందలి పద్యములన్నియు విని యానందించి ప్రచురణభారము వహించిన బ్రహ్మతేజస్సంపన్నులు బ్రహ్మజ్ఞానులు శ్రీ స్వామి రామానంద సద్గురు సేవాపరాయణి స్వప్రకాశినియగు శ్రీ స్వప్రకాశమ్మ( కీ॥ శే॥ తీగెల బాలగురువులుగారి కుమార్తె జగన్నాథమ్మ ,గారికి

నా మనఃపూర్వకాభివందనములు.

ప్రచురణానుకూలమునకుగా నరసున్నలు వాడుట విడనాడితిని. విజ్ఞులు మన్నింతురుగాక! చక్కగాముద్రించి యందిచ్చిన శ్రీ వరదా ముద్రణాలయాధిపతులు శ్రీమాన్ పి. ఎస్. వరదాచార్యులుగారికి నా ధన్యవాదములు.

గంగుబూడి

విద్వద్విధేయుడు
కుప్పిలి సుదర్శనరావు పట్నాయక్

# కృతజ్ఞత

కం. శ్రీ స్వప్రకాశ నామము
భాస్వద్విమలగుణయుతము, భావముగూడన్
నీ స్వాంతంబందనిశము
శ్రీస్వాతంత్ర్యాభివృద్ధి జెందుచునుండున్. ౧



కం. తీగెల బాలగురుండిల
బాగగు పద్ధతిని తత్త్వవాసనలిచ్చెన్
రాగమునొసగు దుహితవని
సాగగ నాశీర్వదించె సాధనబలమున్ 2

కం. శ్రీరామానందుని, గురు
ధీరాజుని గొల్చినావు తేజము హెచ్చన్
సారాసారములెఱుగుచు
సారమతిన్ బ్రబలినావు సద్గుణఖనివై 3

కం. కట్టడిగాగన్ నెట్టిరి
విట్టటుగా నట్టి పెట్టులెట్టివియన్నన్
కట్టితివాలయముల, మఱి
బెట్టితివీ కృతికిగూడ పెద్దగనగుచున్ 4

కం. శ్రీసంకాశముగాదగి
భాసిలు నీ నామమెందు పావనగుణివై
నీ సరి మూర్తి నిగానను
భాసుర ధీ నిలయవమ్మ వర్ధిలుమెపుడున్ 5

భవదీయుడు
కుప్పిలి సుదర్శనరావుపట్నాయక్

# సింహావలోకనము.

| | |
|---|---|
| సాహిత్యకోవిద క్రొవ్విడి రామం | మఠమువీధి |
| బి. ఎ. బి. యల్. బి. ఇడి. | కస్పా |
| ఉపాధ్యక్షులు | విజయనగరం-2 |
| కౌముదీ పరిషత్ | 22-5-80 |

సాహిత్యంలో శతకరచన విశిష్టస్థానాన్ని ఆక్ర



మించుకుంది. గీర్వాణభాషలో సుభాషిత త్రిశతి, అమరుకము, సూర్యశతకము, మహిషశతకము వంటి రచనలు నేటికి ధృవతారల్లాగ నిలిచి ఉన్నాయి. ఆంధ్రభాషలో మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్త్వసారము శతకరచనకు శ్రీకారం చుట్టిందని కొంతమంది పండితుల అభిప్రాయం. శివకవులు శతకరచనకు సర్వాంగ సౌష్టవాన్ని కలిగించేరు.

భక్తి, శృంగార, వైరాగ్య భావాలను కమనీయంగా రమనీయంగా రూపొందించడానికిన్నీ, దేశంలోని సాంఘిక, రాజకీయ, నైతిక పరిస్థితులను హృదయంగమంగా వివరించి సంఘంలోని లోటుపాటులను ఎత్తిచూపడానికిన్నీ ఈ శతకాలు ఎంతగానో ఉపచరిస్తాయి. సంఖ్యానియమము, మకుటము ఒక్కొక్క పద్యమునకు ఒక్కొక్క ప్రత్యేకభావము శతకరచనయొక్క విశిష్టలక్షణాలు. నీతి, ఆస్తికత సత్ప్రవర్తనము ఉగ్గుపాలతోనేరంగరించి పోయడానికా అన్నట్టు సుమతీశతకము కృష్ణశతకము, వేమనశతకము ఆంధ్రమాతలు తమ

బిడ్డలకు పసితనములోనే నేర్పుతారు.

కళింగాంధ్రంలో అడిదము సూరకవి, చట్రాతి లక్ష్మీ నృసింహకవి, గోగులపాటి కూర్మనాథకవి మొదలైన వారు సంఘాన్ని సరిదిద్దే పరికరంగా శతకాన్ని ఉపయోగించుకున్నారు. నవకవు:లో అగ్రగాములైన చెళ్లపిళ్ల, వడ్డాది మొదలైనవారు గూడా శతకరచనను ఆదరించి దానికి ఆశ్రయమిచ్చేరు.

యువకవి చిరంజీవి సుదర్శనరావు పట్నాయక్ రచించిన హరి శ్రీకృష్ణా అనే మకుటంగల శతకం మధుర మంజులంగాను, శ్రవణపేయంగాను ఉందనడంలో సందేహము లేదు. హృదయంలో ఆవిర్భంచిన ఒక తపనను భక్తి భావనరూపంగా ఈ యువకుడు ఈ కందాలను రూపొందించేడు. కందం తెలుగుజాతికే వన్నెతెచ్చే ప్రత్యేకమైన రచనాపద్ధతి. తిక్కన, కవిచౌడప్ప మొదలైనవారు ఈ కందాన్ని అందంగా మలచి దిద్దేరు. చిరంజీవి సుదర్శనరావుపట్నాయక్ ఈ కందాలన్నిటిలో ఒకే మకుటాన్ని ఒకే యతిస్థానంలో నియమించి కృతకృత్యు



డైనాడు. పూలమాలలో దారంలాగే ఈ పద్యాలన్నిటిలో భక్తిభావన స్పష్టంగా గోచరమవుతుంది.

"నీ భాగ్యమె సర్వంబని
నే భావన సేయుచుంటి నిక్కము సుమ్మీ
నా భారము నీయది, భ
క్తాభరణా! బ్రోవుమయ్య హరి శ్రీకృష్ణా!"
నీ నామమతిపవిత్రము
నీ నామము ముక్తిపథము నిర్మలరూపా!
నీ నామము రక్షప్రద
మానామము మాకు దిక్కు హరి శ్రీకృష్ణా!

మొదలైన పద్యాలు ఈ కవియొక్క భక్తిభావనకు మచ్చుతునకలు. వర్ధమానుడైన ఈ రచయిత అనేక సాహిత్యరచనలతో వాగ్దేవతను సంతతము ఆరాధిస్తూ ఉండాలన్నదే నా ఆకాంక్ష.

స్వస్తి

క్రొవ్విడి రామం.

డించవలెనని ఆకాంక్షిస్తూ ఆశిస్తూ ఆశీస్సులనందిస్తున్నా
ను.

అనకాపల్లె — నామపిపాసిని
9-6-80 — ( మేకా రామారావు )

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

# హరి శ్రీకృష్ణ శతకము

కం. శ్రీమత్కృపాసముద్రా!
స్వామీ! యీ కందములను, సద్భక్తునిగా
నీమముగ నర్పణసేయ, ని
యామకమున నుంటి దేవ హరి శ్రీకృష్ణా! 1

కం. శ్రీమత్పూజ్య పదాంబుజ
సామాథర్వణ వినోదచాతుర్వ్యూహా!
కామ క్రోధ విలక్షణ
శ్యామల తేజోవిరాజ హరి శ్రీకృష్ణా 2

కం. శ్రీ రాధాప్రియ! నుత శృం
గారాధారాఖిలేష్టకల్పితచేష్టా!
నారాయణ యని దలచెద
నారయుమా! నిష్కళంక హరి శ్రీకృష్ణా 3

కం. శ్రీరమ్యాకార ప్రభు
నీరజపత్రేక్షణా! వినీలసుగాత్రా!
క్షీరసముద్రావాస! మ
హారాణ్మౌళిమణితేజ! హరి శ్రీకృష్ణా! 4

కం శ్రీవరదా! భక్తావళి
భావానుగుణానుభావ! భావాభావా!
భావము నీపైనుంచెద
నావల నీ భావమయ్య! హరి శ్రీకృష్ణా! 5

కం. చదువులు జదువగవచ్చిన
పదనెఱిగిన వ్రాతగాదు! పదపడి నా యీ
పదముల సరిజేయుచు, న
న్నద నెఱుగుచు నాదుకొమ్ము హరి శ్రీకృష్ణా 6

కం. ఇంచుక నేశాస్త్రము వ
ల్లించుట నే నెఱుగనయ్య! యిమ్ముగ నిను భా
వించుచునుంటిని, నను నీ
వంచితముగ బ్రోవుమయ్య హరి శ్రీకృష్ణా! 7



కం. నారాయణ నారాయణ
నారాయణయంచు గొల్తు నా హృత్సీమన్
శ్రీరంజిల్లన్ గౌస్తుభ
హారాలంకృతశరీర హరి శ్రీకృష్ణా! 8

కం. హరి హరులను నామమ్ముల
నరయంగ నభేదమందురార్యులఽపూర్వా
దర భావమ్మున బ్రోవుము
హరిహరనాథైకరూప హరి శ్రీకృష్ణా! 9

కం. కరములు నీ యర్చనలకు
నురమా! నీ రూపురేఖలూహను సచ్చి
త్తరువుగ బ్రతిబింబింపగ
నరయుచు నను సాకుమయ్య హరి శ్రీకృష్ణా! 10

కం. వినియుంటిని నీ మహిమల
ననియుంటిని నీదు నామమార్తత్రాణా!
కనియుంటిని నీ భక్తుల
ననిశము మది నమ్మియుంటి హరి శ్రీకృష్ణా 11

కం. యుగయుగముల నీ మహిమలు
బగతురు దెగటార్చుకొనుకు బలురూపంబుల్
సగుణా! నిర్గుణరూపా!
అగణితగుణభూషతోష హరి శ్రీకృష్ణా! 12

కం. ఎంతయు జింతించిన జగ
మంతయు నీ బొమ్మరిల్లు యాడెదవందున్
ఇంతయు నీ యాటల తను
పంతయు మా పైనిగాదె హరి శ్రీకృష్ణా! 13

కం. కర్తవు, జగములపాలన
భర్తవు, సాధుజనలోకపాలా! నీవే
కర్తవ్యము జూపుదువో?
ఆర్తశరణ్యా! భరింతు హరి శ్రీకృష్ణా! 14

కం. శ్యామలజగదభిరామా!
రామా! భీమా! మనోభిరామా! ప్రేమా!
కామా! అభయంబిమ్మా
అమాటాలింపరావ? హరి శ్రీకృష్ణా! 15



కం. పరమపితా మహనీయా!
చరితార్థా! సత్యలోల సదమలహృదయా!
నరసింహాచ్యుత సదయా!
హరిహరరూపానుమేయ * హరి శ్రీకృష్ణా! 16

కం. పరమకృపామయ దేవా!
పరమాత్మాచిత్యనిత్యపావనభావా!
సరసిజనేత్రా! రావా?
అరయుగ సజ్జనులగావ హరి శ్రీకృష్ణా! 17

కం. ఆపదక్షణభారా!
గోపీ గోపాలలోక కూర్మివిహారా!
మాపై ప్రేమ సుధీరా!
ఆపక సాకంగ మధుర హరి శ్రీకృష్ణా! 18

కం. మాపై నింత పరాకా?
మాపటి రేపటి దయాభిమానులనేకా!
ఏపై జూడ జిరాకా?
ఆపత్పరిపాలలోక హరి శ్రీకృష్ణా! 19

*అనుమేయ— ఊహింపదగిన

కం. కరుణాసింధు విధాతా!
తరుణంబిదె గావరమ్మ ధర్మవినీతా!
మరువకు త్రిభువననేతా!
అరుణాచలసాటి పూత హరి శ్రీకృష్ణా! 20

కం. ముని సంపూజితపాదా!
సునిశిత దృక్కుల వినోద సూరిప్రమోదా!
జనయీప్సితార్థ వరదా!
అనిలామల సుప్రసాద హరి శ్రీకృష్ణా 21

కం. సకలకళామయ భూషా!
నికరగుణాలంబహృదయ నిలయ మహేశా!
సకలార్థ సాక్షితోషా!
అకలంకా! ఆత్మపోష హరి శ్రీకృష్ణా! 22

కం. సదమలకరుణాసాంద్రా
మదిలోనొక విడుత*యైన మసలుముపేంద్రా
యదుకులసాగరచంద్రా!
అదరులు బోవన్ సుధీంద్ర హరి శ్రీకృష్ణా! 23

* విడుత-క్షణము



కం. నీలావినోదలోలా!
నీలశరత్కాలమేఘ నిర్మలశీలా!
శాలిప్రియ హేలా! మహి
మాలయ నిన్నెన్నజాల హరి శ్రీకృష్ణా! 24

కం. పన్నగ పన్నగతల్పా!
కన్నుల సన్నల విశేషకలిసంకల్పా!
ఎన్నగ కామవికల్పా!
అన్నుల మిన్నల కనల్ప హరి శ్రీకృష్ణా; 25

కం. నా కై మోడ్పులు గొనుమా
పాకారిప్రముఖవినుత పావననామా!
శ్రీకర * తిరుగురుపరమా!
ఆకారాభ్యుదయమహిమ హరి శ్రీకృష్ణా! 26

కం. నీ పాదము పాపాంతము
నీ పాదము ముక్తినిచ్చు నీరజసామ్యా
నీ పాదము నెద నమ్మితి
నా పాదమె నాకు శరణు హరి శ్రీకృష్ణా! 27

* తిరు-శ్రేష్ఠమైన

కం. స్వామీ! నీ మృదుపదముల
నేమరక భజింతు ననిశమేర్పడు భక్తిన్
నేమము వీడక, నీవే
యామరణాంతంబు దిక్కు హరి శ్రీకృష్ణా! 28

కం. నీ నామమతిపవిత్రము
నీ నామము ముక్తిపథము నిర్మలరూపా!
నీ నామము రక్షప్రద
మానామమె మాకు దిక్కు హరి శ్రీకృష్ణా! 29

కం. పావనమగు నీనామము
భావమునందుంచి నేను భక్తి భజింతున్
ఓ వసుదేవకుమారా!
ఆవల నీ భారమయ్య హరి శ్రీకృష్ణా! 30

కం. ఓ నందుని ముద్దుల ప
ట్టీ! నందార్భకులలోక డింభక యో దే
వానందా! కరుణా సాం
ద్రానందావాస యీశ! హరి శ్రీకృష్ణా! 31



కం. దీనుని గృపజూడగ, నీ
యాననమును జూపుమయ్య అఖిలేశ్వర! నీ
యానసుమా! నిను నమ్ముచు
నానతి పాటించనుంటి హరి శ్రీకృష్ణా! 32

కం. నయ వినయ విధేయతలను
భయ భక్తుల నీదు సేవ పావనమతియున్
నయముగ నీయగ రావే
మయా! మహామహిత గోప హరి శ్రీకృష్ణా! 33

కం. కేశవ! ఘన నీ కరుణా
పాశమునందుంచి నన్ను బరికింపంగా
నీశా! నిను నే గొల్చెద
నాశాపాశంబు తోవ హరి శ్రీకృష్ణా! 34

కం. నందుని ముద్దుకుమారా!
బృందావనవిహారణేశ వీరవరేణ్యా!
ఎందును నిను నే నమ్మితి
నందటిలో మిన్నవంపు హరి శ్రీకృష్ణా! 35

కం. జగదభిరామా! మోహన
సుగుణాకర భక్త చిత్త చోరా! ధీరా!
పగవారు గాంచవశమా?
అగణితసద్ధర్మపోష హరి శ్రీకృష్ణా! 36

కం. నవ్యాంబుజ పత్రేక్షణ
భవ్యాకారంబు జూపి పతితోద్ధరణా
సవ్యంబగు బద విమ్మా!
అవ్యక్త గుణాలవాల హరి శ్రీకృష్ణా! 37

కం. ప్రభు! నీ మాహాత్మ్యంబిల
నభేద్య మవ్యక్త జాలమాగమ వేద్యా!
శుభగాసూరిజనస్తుత
అభయంకర సాకుమయ్య హరి శ్రీకృష్ణా! 38

కం. పదునాఱువేల నెలతలు
బదిలంబుగ నీకు నెటుల బ్రాప్తంబయిరో?
తుదిమొదలు లేని నీకే
లది? యూహింపవశమె? హరి శ్రీకృష్ణా! 39



కం. ఎన్నాళ్లిట్లుండుటయో?
నిన్నాతుర వేడుకొందు నిత్యుడవనుచున్
నన్నావల ద్రోయకుమా!
అన్నా! ఆపత్శరణ్య! హరి శ్రీకృష్ణా! 40

కం. ఎన్నో జన్మల నెత్తుచు
నిన్నాళ్లకునిట్టి జన్మమేర్పడె గానన్
నన్నేరీతిని బ్రోతువా?
అన్నా! శాంతస్వరూప! హరి శ్రీకృష్ణా! 41

కం మాయామానుషవిగ్రహ
పాయక నను బ్రోవుమయ్య భావానందా!
మాయాజాలపు యీ జ
న్మాయాసము బాపుమయ్య హరి శ్రీకృష్ణా! 42

కం. నిశియనకను, దినమనకను
యశనము గైకొనెడు వేళనైన సుబుద్ధిన్
దశజన్మా! నిను వేడెద
నశోకకిరణ ప్రసన్న హరి శ్రీకృష్ణా! 43

కం. శిక్షా పాపపుశక్తుల,
పక్షా సజ్జనసమూహ భారమునందున్
రక్షా భక్తజనాళికి
నక్షయముగ వరములిచ్చు హరి శ్రీకృష్ణా! 44

కం. తపియించితి నీకై, నే
విపులమ్ముగ జెప్పనేల? విధిగా నీ సత్
కృపతో బ్రోవగ రావే!
అపురూపా! ఆదిరూప! హరి శ్రీకృష్ణా! 45

కం. వేసరితోనుంటిని, నీ
కై సల్పుదు నియమబద్ధకాలముగా, నీ
దాసులు దప్పకుమీ! ప
ద్మాసన లక్ష్మినివాస హరి శ్రీకృష్ణా! 46

కం. జపములు దపములు నెల్లను
నెపములు గాకుండ జేసి నేర్పరిమతులై
కృపగలిగిన జిత్తముతో
నపురూపా! మెలగనిమ్ము! హరి శ్రీకృష్ణా! 47



కం. బుధజనులందఱు నిత్యౌ
షధమగు నీ మంత్రసిద్ధి చక్కగ బొందన్
సుధగా గ్రోలెద రెప్పుడు
సదమోదము లెఱుగబోరు హరి శ్రీకృష్ణా! 48

కం. నీ తలసరి రా దైవ
మ్మే తలపుననైన గాన నేనా దైనన్
నా తలపును బలపరచియు
నాతతమును బ్రోవుమయ్య హరి శ్రీకృష్ణా! 49

కం. పిలిచిన పలుకవ దేలా?
అలుకా? పలుమాఱు బిలువమనియా? దేవా!
పలురూపా! నిను నమ్మితి
నలఘుగుణస్థితుడవనుచు హరి శ్రీకృష్ణా! 50

కం. హృదయము నెఱిగియు యత్నము
సదమలమగునేని నిండు సద్భావముతో
సదనుగ దర్శనమిచ్చెద
వదియును క్షణమాత్రలీల హరి శ్రీకృష్ణా! 51

కం. ఎవ్వడు సృష్టికి కారకు
డెవ్వండీ భూతజాల మేర్పడజేసెన్
ఎవ్వ డెవండని దలపగ
నవ్వసుధాభర్త వీవె హరి శ్రీకృష్ణా! 52

కం. తనువును భార్యా పుత్రులు
ధన ధాన్యాదులిల శాశ్వతమ్మని వెస నె
మ్మనసము భావన బోవగ
ననిశము మము సాకుమయ్య హరి శ్రీకృష్ణా! 53

కం. రేయిం బవలున్ బన్నగ
శాయీ! నిన్నే నుతింతు సంకల్పములో
బ్రాయికముగ నను గనుచున్
హాయిగ సాహాయ్యమిమ్ము హరి శ్రీకృష్ణా! 54

కం. నిండు మనమ్మున, నిను వే
రెండగు భావమ్ములేని యోర్మిన్ వేర్మిన్
దండిగ నే గొల్చెద, నీ
యండనె నన్నుండనిమ్ము హరి శ్రీకృష్ణా! 55



కం. పనిగా నామ జపమ్మును
మనమున భావించువారి మానమ్మును బ్రో
చిన వాడవు నీవే గద!
అనుపమ మధురాతిమధుర హరి శ్రీకృష్ణా! 56

కం. ప్రద్యుమ్న హృషీకేశా!
విద్యా సద్బ్రహ్మతేజ వేదస్తుత్యా!
సద్యోభవ నిన్నెన్నడు
నద్వ్యతసులు గానలేరు హరి శ్రీకృష్ణా! 57

కం. చల్లని నీ నామము, మే
నెల్ల గగుర్పాటు నొంద నేర్పడె నాలో
నల్లని నా స్వామీ! నీ
వల్లన నను బ్రోవుమయ్య హరి శ్రీకృష్ణా! 58

కం భూరిప్రచండ! మార్తాం
డా! రిపుజనులొందు భీతి శావుల్బోవన్
యేరీ? యీ ధరలో నసు
రారీ! నీ సాటివారు హరి శ్రీకృష్ణా! 59

కం. నొసటన్ వ్రాసిన వ్రాతలు
వనరుహసంభవునకైన వృథగావు హరీ!
పసగలిగిన చిత్తముతో
నసహాయా! యేలు మమ్ము హరి శ్రీకృష్ణా! 60

కం. నీదు ప్రభావంబెన్నగ
నాదిత్యుని వశమె జూడ నఖిలాకాండా
మోదా! సద్భక్తజనా
హ్లాదా! నే నెంతవాడ? హరి శ్రీకృష్ణా! 61

కం. మనమున నిను ధ్యానించిన
మనుజుల మానమ్ము బ్రోచు మాన్యుడవంటున్
వినయమ్మున నిను వేడెద
ననివార్యా! నీవె దిక్కు హరి శ్రీకృష్ణా! 62

కం. నెయ్యమునన్, వియ్యమునన్
గయ్యమునన్ శ్వేతవాహు గాపాడితివే
దుయ్యకుమీ! నా తప్పుల
నయ్యా! నను గావుమయ్య! హరి శ్రీకృష్ణా! 63



కం. ఇమ్ముగ దెఱచితి నీకై
రమ్మమ్మద్ధృదయభాగరమ్యస్థలి కిన్
గొమ్మా! ఎదదమ్ముల సిరు
లమ్మకు విందొసగునట్టి హరి శ్రీకృష్ణా! 64

కం హృదయ విశాల మనోహర
సదనంబందీవు గాఢసద్బంధనమై
సదమల దృష్టిన్ జూచిన
నది శాంతికి మూలమయ్య హరి శ్రీకృష్ణా! 65

కం. ధైర్యాలోచనము, సదా
శౌర్యాధిక్యమ్ము, విమల సత్సంగతియున్
కార్యానుకూలదక్షత
నార్యజనామోదమిమ్ము హరి శ్రీకృష్ణా! 66

కం. నీ చరణము నెఱనమ్మిన
దోచును మాహృదయమందు దోడూయముగన్
గాచునిమిత్తము సత్క
ర్మాచరణాసక్తి గాదె! హరి శ్రీకృష్ణా! 67

కం. నీ భాగ్యమె సర్వంబని
నే భావనసేయుచుంటి నిక్కము సుమ్మీ
నా భారము నీయది, భ
క్తాభరణా! బ్రోవుమయ్య హరి శ్రీకృష్ణా! 68

కం. ముఖమున నీ చిఱునవ్వులె
నిఖిలజగమ్ములకు శాంతినిధ్యమునిచ్చున్
సుఖదాయక! సౌలభ్యా!
అఖిలాండప్రభూ! సుధీర! హరి శ్రీకృష్ణా! 69

కం. ఎత్తెఱుగననైనన్ నా
సొత్తుగ నీ నామమిమ్ము, సులభంబౌ, నా
చిత్తము పలురీతి పరా
యత్తము గాకుండనిచ్చు హరి శ్రీకృష్ణా! 70

కం. ఎత్తిన యీ జన్మపునై
మిత్తిక దేహమ్ము నెపుడొ మృత్యువు విధిగా
నెత్తుకొని బోవనున్నపు
డత్తఱి నీ గమ్యమిమ్ము హరి శ్రీకృష్ణా! 71



కం. రాగద్వేషమ్ముల, దుల
దూగెడసుర సోమకాఖ్యు ద్రుంచితివయ్యా!
సాగరమున మత్స్యమవై
ఆగమముల నుద్ధరింప హరి శ్రీకృష్ణా! 72

కం. సురలసురులు క్షీరాబ్ధిని
నురుతరదీక్షన్దరువగ నుదయించు సుధన్
స్థిర దక్షతనిచ్చితి వీ
వరిభీకర కమఠరూప హరి శ్రీకృష్ణా! 73

కం. ధరణిన్ జాపగ జుట్టిన
వరప్రభావ నియతాత్మపరుని హిరణ్యా
క్షరమును వ్రక్కలు జేసిన
హరా! వరాహావతార హరి శ్రీకృష్ణా! 74

కం. అప్రాకృతమున వైదిక
విప్రత్వము నొందియున్న విష్ణుసుభక్తున్
* క్షిప్రముగా బ్రోచితివే!
అప్రతిహత నారసింహ హరి శ్రీకృష్ణా! 75

* క్షిప్రముగా - త్వరగా

కం. బలదర్పమణప, శౌర్యో
జ్వలనవని సురస్వరూప వడుగై నీవా
బలిచక్రవర్తి నడిగితి
వల మూడడుగుల ధరణిని హరి శ్రీకృష్ణా! 76

కం. నీ తపములు విడనాడియు
భూతలనాథులను నీదు భూరికుఠారా
ఘాతముచే జంపిన భృగు
వాతత విక్రమ బలాఢ్య హరి శ్రీకృష్ణా 77

కం. అవనీభారము ద్రుంపగ
నవనీసంజాత సీత నాలించుటకై
శివధనువు నుగ్గుజేసితి
వవలీలగ భ్రాంతిగొలుప హరి శ్రీకృష్ణా! 78

కం. బల శౌర్య ధైర్య కౌతూ
హల రారాజాభిమానివంచిత ప్రజ్ఞా!
బలరామా! నిను వేడెద
హలధారీ! యదుకులాగ్ర హరి శ్రీకృష్ణా 79



కం. సత్యాహింసలు, ధర్మం
బత్యంత మస్థాయినొంద నలఘుస్థితితోన్
నిత్యతపోనియతాత్మా
అత్యగణిత బుద్ధరూప హరి శ్రీకృష్ణా! 80

కం కలికాలంబున హెచ్చగు
గలికల్మషమంతమొంద ఘనతన్ వాజిన్
నిలబడి ఖడ్గము బూనదు
వలగురు కల్క్యవతార హరి శ్రీకృష్ణా! 81

కం. వినదగు నీదు చరిత్రము
కనదగు నీ రూపురేఖ కమనీయంబౌ
అనదగు నీ సంకీర్తన
మనవరతము ముక్తినిచ్చు హరి శ్రీకృష్ణా! 82

కం. వెస నూహించెద మనమున
మసలక మెసలంగ రావె మహితోజ్వల నీ
కుసుమార్చిత గురుపాదము
ల సమానాశ్రయమనెంతు హరి శ్రీకృష్ణా! 83

కం. పరమపితా! మా ప్రార్థన
స్థిరహృదయనివేదనమ్ము జేకొని మాలో
బొరలుచు రగిలెడు జ్వాలల
నరిషడ్వర్గము ద్రోలు హరి శ్రీకృష్ణా! 84

కం. కృపచే గనవేమయ్యా!
అపరచితునిగా దలపకు మఘవా! నీ పా
ద పయోరుహ చింతన మి
మ్మపరప్రవర్తన సుశీల! హరి శ్రీకృష్ణా! 85

కం. దండమయా! పరిశుద్ధా!
దండమయా! త్రిభువనైకధర్మాభీష్టా
దండమిదే గైకొనుమా!
అండజవాహనవినోద హరి శ్రీకృష్ణా! 86

కం. దినకర సహస్రతేజా!
ఘనబాహో పటువిశేషకార్యవిరాజా!
కనుమా నయనసరోజా
అనుమా బ్రోతునని రాజ హరి శ్రీకృష్ణా! 87



కం. చింతన నీపై నే గా
వింతు నిరతమ్ము నాదు విధ్యుక్తముగన్
జింతాంతము జేసియు, నా
యంతర్భావమున మెలగు హరి శ్రీకృష్ణా! 88

కం. చిల్లరదైవమ్ముల నే
నొల్లను నిన్నే నుతింతు నూర్జితముగ, నా
యుల్లమందుండుము నీ
వల్లన నుత్సాహమిచ్చి హరి శ్రీకృష్ణా! 89

కం. బాల్యమె సద్విద్యా కౌ
శల్యత బెంపొందజేయు శక్తి నొసంగన్
బాల్యప్రాయుని గావ న
హల్యవరద వేగరావ? హరి శ్రీకృష్ణా 90

కం. తడబడుచుంటిని, నా మను
గడయందు నలసి సొలసితి, గరుణించుమ, వే
నుడువేల? సుస్థిరపద
మ్మడిగితి నిను నమ్ముకొనుచు హరి శ్రీకృష్ణా!91

కం. పరమాత్మా! ఉదరమ్మున సా
దరముగ లోకమ్ములన్ని ధరియించియు, సు
స్థిరపద్ధతి నుంచవుగద
హరి హరి నిను నమ్ముటెట్లు? హరి శ్రీకృష్ణా 92

కం. జన్మంబొందితి నరునై
సన్మార్గము జూపి నన్ను సంపన్నునిగా
నున్మీలనేత్రమిమ్మా!
హన్మంతుని బ్రోచినటుల హరి శ్రీకృష్ణా! 93

కం. విజ్ఞానము నీ స్మరణమె
ప్రజ్ఞా? నీ పాదసేవె - పతితోద్ధరణా!
సుజ్ఞానమార్గమిచ్చియు
నజ్ఞానమును బాపుమయ్య హరి శ్రీకృష్ణా! 94

కం. అడిగిన లేదనవని, మది
నిడితిని నీ మధుర నామ మిహపరమందున్
దడజాటులేని స్థిరపద
మడిగిన యీగల్లు జేడ! హరి శ్రీకృష్ణా 95



కం. పర్యాలోచనచే నీ
పర్యాయమ్మైన ముక్తి ఫలమును, సర్వాం
తర్యామీ! నాకీయగ
నార్యా! నిర్ణయముసేయు హరి శ్రీకృష్ణా! 96

కం. ప్రత్యక్ష దేవదేవా!
సత్యజ్ఞాన స్వరూప సర్వశ్రేష్ఠ
స్తుత్యానందా! కైకొను
మత్యుత్తమసేవలెల్ల హరి శ్రీకృష్ణా! 97

కం. చిక్కిన నీ నామసుధన్
మక్కువచే విడువనయ్య మదిలో నిన్నే
నిక్కముగ విశ్వసించితి
నక్కఱలందాదుకొనెడి హరి శ్రీకృష్ణా! 98

కం. నీ పదసేవాభాగ్యమె
ప్రాపుగ దగు శిక్షణమ్మవారితముగ నె
ప్డేపు వహించన్ ద్వర న
న్నాపదలందాదుకొనుమ హరి శ్రీకృష్ణా! 99

కం. దేహాభిమాన * మక సం
దోహముతో గూడియుండి తూలుచునుంటిన్
దేహము సందేహ మిమ్మ
యైహిక సుఖమింక జాలు హరి శ్రీకృష్ణా! 100

కం. విశ్వమయ విశ్వరూపా!
విశ్వలయాకార విశ్వ! విశ్వాతీతా!
విశ్వధురేయ ప్రభు, వి
శ్వైశ్వర్యాధార విశ్వ హరి శ్రీకృష్ణా! 101

కం. శరణము జగన్నివాసా!
శరణమ్ము సమస్త జీవసంబంధనిధీ!
శరణము నీ చరణము, నీ
యరణమ్ముగ ముక్తి నిమ్ము హరి శ్రీకృష్ణా! 102

కం. చెప్పిన యీ కందమ్ముల
నొప్పుగ రూపించి మన్ననొందించగ నా
తప్పొప్పుల భారము నీ
దప్పా! శ్రీ వేంకటప్ప హరి శ్రీకృష్ణా! 103

* అక — దుఃఖము



కం. ప్రత్యూషము నీ శతకము
సత్యోత్సాహముగ బఠనమవని జరుపు వా
రత్యుత్తమ పదమొందుదు
రత్యగణిత విశ్వరూప హరి శ్రీకృష్ణా! 104

కం. ధర లక్ష్మీకాంత వేంకట
నరసింహుల ప్రియసుతుండ నారతహిత నీ
సరసిజ పద సేవన మిడ
నరయుము వైకుంఠవాస హరి శ్రీకృష్ణా! 105

కం. పలుకుదు నీ నామమ్మును
పలు పర్యాయములు, యాజ్ఞవల్క్య ప్రవరన్
ఊలికేశ గోత్రరత్నం
బలఘు సుదర్శనుని బ్రోవు హరి శ్రీకృష్ణా! 106

కం. జయమను మీ లోకములకు
జయమను బుధభక్తలోక సజ్జనమునకున్
జయమను యతిగణ నియమ, స
హయూపనమె శ్రేష్ఠమంచు హరి శ్రీకృష్ణా! 107

కం. మంగళము మహిత సద్విత
మంగళము యశోవిశాల మంగళచరితా!
మంగళమని పాడెదమో
యంగజు ముదమారగన్న హరి శ్రీకృష్ణా! 108

శ్రీ ముకుంద చరణారవింద నిరంతర ఉమందానంద సంసేవాసక్త సాహిత్యవ్యాసంగవినోద సాహిత్యకోవిద సంవిధేయ బుధజనానుమేయప్రమేయ భక్తజనానురక్త సుజనమిత్ర శ్రీ కుసుమ హరనాథ శతకాద్యనేక రచ నాధారేయ శ్రీ యశోదమాంబా నృసింహపౌత్ర లక్ష్మీ కాంత వేంకటనృసింహపుత్ర జిల్లాపరిషదున్నత పాఠ శాలాంధ్ర పండితపదవీస్థిత సత్యజ్ఞానాంబాకళత్ర ఆంధ్ర విశ్వకళాపరిషద్ధత్త ఆంధ్రసాహిత్యాచార్య బిరుదాంకిత యాజ్ఞవల్క్యత్రిప్రవరాన్విత ఉలికేళసగోత్రకుప్పిలాన్వయ

సుధాకరుండగు సుదర్శనరావు
పట్నాయకునిచే రచింపబడిన
హరి శ్రీకృష్ణశతకము
సర్వంబు సంపూర్ణము - ఇతి - శమ్.

## తప్పొప్పుల పట్టిక

| పేజి | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ౨ | 6 | నాసక్తినిధిది | నాసక్తినిఃదిది |
| ౯ | 14 | ఆవిర్భంటిన | ఆవిర్భవించిన |
| ౧౧ | 6 | పరిస్థితులలో | పరిస్థితులలో |
| ,, | 16 | సాపుర్థ్యము | సామర్థ్యము |
| 3 | 8 | నాస్తిక | నాస్తిక |
| 14 | 7 | మ్మనసము | మ్మనమున |
| 17 | 2 | రస్మమ్మ | రమ్మనస్మ |
| 22 | 4 | సరిషద్వర్గము | సరిషద్వర్గమ్ము |
| 23 | 2 | వింతునిర | వింతునునిర |
| ,, | 7 | యుల్లసుందు | యుల్లమ్మందు |
| ,, | 16 | మ్మతిగతి | మ్మడిగితి |
| 24 | 12 | సజ్ఞానమును | సజ్ఞానమును |

## కృతిసమీక్ష

ముద్రితములు

1. శ్రీ కుసుమహారనాథ శతకము 1967
   ప్రతులు లేవు
2. శ్రీ కుసుమ హార నాథ దండకము 1968
   ప్రతులు లేవు
3. హరి శ్రీకృష్ణ శతకము 1980

అముద్రితములు

1. శ్రీ సత్యనారాయణ స్తవము
2. శ్రీ ముత్యాల సరాల గీత